క్లుప్తంగా

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని చైర్ పర్సన్ గత్తం కస్తూరిబాయి బుధవారం తెలిపారు. పట్టణంలోని పలు సమస్యలపై కౌన్సిలర్లు ప్రతిపాదించిన అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు వివరించారు.

ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం



నూజివీడు: పట్టణంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మిట్టగూడెంలో నిర్వహిస్తున్న సేవాశిబిరం బుధవారం నాటికి ఆరో రోజుకు చేరింది. దీనిలో భాగంగా గ్రామంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వయం ఉపాధి విధానాలను వివరించారు. ఎండుపూల తయారీ, సువాసన నూనె తయారీ, టమాట, చిల్లీస్ సాస్‌ల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు మిరప నారును అందజేశారు. వీధుల్లో, అంగన్‌వాడీ కేంద్రం వద్ద, గుడి ప్రాంగణాల్లో ఉసిరి, నేరేడు, వేప మొక్కలను నాటారు. ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి, ఫ్యాకల్టీ కాంచన, పద్మజ, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ పథకంతో మేలు



విస్సన్నపేట: వైఎస్సార్ జలకళ పథకం రైతులకు ఎంతో ఉపయోగమని ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ జలకల పథకం కింద లబ్ధిదారులకు ఉచితంగా సబ్‌మెర్సిబుల్ మోటార్లను బుధవారం అందజేశారు. మండలంలో కలగర పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతులు దార్ల మారెమ్మ, సూరమ్మలకు ఉచితంగా బోరు వేయటంతో పాటు సబ్‌మెర్సిబుల్ మోటారు ఉచితంగా అందించారు. రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ అన్నారు. మెట్టభూములకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ జలకళ పథకం అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమారి, ఏపీఓ అనురాధ, వార్డు సభ్యుడు పిల్లి రాజేష్, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలకు కౌన్సెలింగ్



ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గంజాయి స్మోకర్లు, విక్రయదారులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం విజయవాడ వెస్ట్ జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి వినియోగం, విక్రయాల వల్ల సమాజంలో జరుగుతున్న చెడు దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. గంజాయి తాగటం, విక్రయించటం చేయరాదన్నారు. కోడి పందేలు, జూదం, అక్రమ మద్యం జోలికి వెళ్లొద్దని అన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన సిలువగట్టు తిరునాళ్ల



నూజివీడు: క్రీస్తు సందేశం విన్నా పాపవిమోచన లభించినట్లేనని విజయవాడ పీఠాధిపతులు మహోఘన తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. సిలువగట్టు తిరునాళ్ల బుధవారం రాత్రితో ముగిసింది. ఈ తిరునాళ్లకు పట్టణంతో పాటు ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు మండలాలకు చెందిన వందలాది మంది క్రైస్తవులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు దివ్యపూజ నిర్వహించి, అనంతరం క్రీస్తు సందేశాన్ని అందించారు. పాపులను రక్షించేందుకు వచ్చిన ఏసుక్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. మరియదళ సభ్యులు క్రైస్తవగీతాలు ఆలపించారు. సిలువగట్టు పుణ్యక్షేత్ర రెక్టార్ ఫాదర్ గొర్రుముచ్చు జోసెఫ్, పలువురు ఫాదర్లు, మఠకన్యలు, విశ్వాసులు, తిరునాళ్ల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

శాస్త్రీయ ఆలోచన అవసరం

- ఘనంగా సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు
- శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటాలకు నివాళులు





మైలవరం ఇంజినీరింగ్ కళాశాలలో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ హనిమిరెడ్డి ; తిరువూరు శ్రీనిధి స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన ఆర్డీవో మాధవి

మైలవరం: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు దోహదం చేస్తాయని ప్రవాసాంధ్రులు, విద్యాదాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను కళాశాల యాజమాన్యం ట్రస్టీ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి బుధవారం ప్రారంభించారు. విద్యార్థులు శాస్త్రీయ వైఖరిని పెంపొందించుకోవడం ద్వారా జ్ఞానదాయక సమాజం ఏర్పడుతుందన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులలో అటువంటి విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన ధోరణి, తార్కిక దృష్టి ఏర్పడటానికి వైద్య వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు ప్రసంగించారు. పోటీలలో 23 టీమ్‌లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి ఎస్ఎస్‌కే స్కూల్, రెండో బహుమతి శ్రీచైతన్య టెక్నో స్కూల్, మూడవ బహుమతి వివేకానంద స్కూల్, కన్సోలేషన్ బహుమతిని కుంటముక్కల బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు గెలుచుకున్నారు. విజేతలకు నగదు, సర్టిఫికెట్లు అందజేశారు. మైలవరం 6వ వార్డు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పీ గోపాల్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వివేకానంద హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రెడ్డిగూడెం: జాతీయ సైన్స్ దినోత్సవం సదర్భంగా బుధవారం మండల నాగులూరు విజయబాబు కాలనీలో పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ప్రాథమిక ప్రధానోపాధ్యాయుడు జి.అనుగ్రహప్రసాద్ పాఠశాల ఉపాధ్యాయిని పి.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతాంజలి హైస్కూలో..

రెడ్డిగూడెం గీతాంజలి హైస్కూలులో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సైన్స్‌కు సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ కే కోటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజలు తప్పనిసరిగా సైన్స్‌ను చదవాలి, పాటించాలని మూఢనమ్మకాలు పారద్రోలాలని కోరారు. ఈకార్యక్రంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అశాస్త్రీయ అంశాలను నమ్మొద్దు

తిరువూరు: ఆధునిక కాలంలో సైన్స్ పేరుతో పలు అశాస్త్రీయ అంశాలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్నాయని, ఇటువంటి అంశాలను నమ్మి మోసపోవద్దని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తిరువూరు సాయిరాఘవ ఎస్టేట్స్‌లో విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత నమ్మకాలపై సైన్స్ ఆధారపడి ఉండదని, శాస్త్రీయ నిరూపణలనే సమాజానికి తెలియజేస్తుందని గంగాధర్ పేర్కొన్నారు. మారుతున్న శాస్త్ర సాంకేతిక విజ్ఞానాంశాల్ని విద్యార్థులు అవగాహన చేసుకోవాలని సూచించారు. జేవీవీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధాకర్, సుదర్శన్, జిల్లా కార్యదర్శి ఎం.రాంప్రదీప్ పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలవరం జెడ్పీ హైస్కూలు హెచ్ఎం గొల్లమందల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీవీ రామన్ సైన్స్‌కి చేసిన కృషి మానవాళికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తుమ్మగూడెం ఉర్దూ పాఠశాల్లో హెచ్ఎం గంపా వెంకట్రావు పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలు విద్యార్థులే

తిరువూరు: విద్యార్థుల్ని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తిరువూరు ఆర్డీవో మాధవి అన్నారు. స్థానిక శ్రీనిధి స్కూలులో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. విద్యార్థుల్లో నెలకొన్న నైపుణ్యాలు, సృజనాత్మక ధోరణిని గమనించి వారిని ప్రోత్సహిస్తే మంచి శాస్త్రవేత్తలవుతారన్నారు. సైన్స్ ప్రాధాన్యత వివరిస్తూ విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను తిలకించారు. హైడ్రో ఎలక్ట్రిసిటీ, సేంద్రియ వ్యవసాయం, ఫైర్ అలారం, కిడ్నీ పనిచేసే విధానం, గ్లోబల్ వార్మింగ్, చంద్రయాన్ తదితర ప్రదర్శనలను రూపొందించిన విద్యార్థుల్ని అభినందించారు. పాఠశాల కరస్పాండెంటు కిషోర్, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నాగార్జున స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం: జాతీయ సైన్స్ దినోత్సవం ఇబ్రహీంపట్నం, కొండపల్లిలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో బుధవారం నిర్వహించారు. కొండపల్లి క్రాంతి పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు, పాఠశాలల కరస్పాండెంట్ వెనిగళ్ల రామారావు పాల్గొన్నారు. కొండపల్లి రవీంద్ర పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సైన్స్‌కు సంబందించిన పలు ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరి దేవి విద్యార్థులను అభినందించారు. ఇబ్రహీంపట్నంలోని నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ముందుగా కళాశాల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి, డాక్టర్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీవీ రామన్ సైన్స్ అవిర్భావానికి కృషి చేసిన తీరును కొనియాడారు. కార్యక్రమంలో పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువూరు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని తిరువూరు మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం నిర్వహించారు. సైన్స్ ప్రాధాన్యతను లక్ష్మీపురం ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.హరికృష్ణ విద్యార్థులకు వివరించారు. పలువురు విద్యార్థులు తాము రూపొందించిన ప్రయోగాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ఆగిరిపల్లి: సైన్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మి అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ పలువురిని ఆకర్షించింది. వట్టిగుడుపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో సర్ సీవీ రామన్ చిత్రపటానికి పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సుప్రియ నివాళులర్పించారు.



కొత్తనాగులూరులో సీవీ రామన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న హెచ్ఎం అనుగ్రహ ప్రసాద్



పోలవరంలో సీవీ రామన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్..

సీఎం జగన్‌తోనే పేదల జీవితాల్లో వెలుగులు

ఆగిరిపల్లి: రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే, ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్ యాదవ్ బుధవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో రైతు భరోసా ద్వారా రూ.40 వేల మంది రైతులు లబ్ధి పొందారన్నారు. ప్రజల కోసం పనిచేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌ను గెలిపించుకోవాలని ఆయన ప్రజలను కోరారు. సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వచ్చేలా పని చేస్తానని హామీ ఇచ్చారు.



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎంపీ అభ్యర్థి సునీల్

పలు అభివృద్ధి పనుల ప్రారంభం

సురవరంలో రూ.20.90 లక్షలతో నిర్మించిన ఇంటింటికీ కుళాయి పథకం, రూ.16 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను, రూ.42 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి ప్రారంభించారు. కొమ్మూరులో రూ.8 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కృష్ణవరంలో రూ.26.10 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. నరసింగపాలెం లో రూ.55 లక్షలతో నిర్మించే ఇంటింటికీ కుళాయి పథకాన్ని, రూ.6 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. రూ.18 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయినేజీలను ప్రారంభించారు. అమ్మవారిగూడెంలో రూ.57.60 లక్షలతో నిర్మించే జల్‌జీవన్ పథకానికి శంకుస్థాపన చేశారు. తోటపల్లిలో రూ.10 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్లకు, రూ.15 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్ భవనానికి శంకుస్థాపన చేశారు. మల్లిబోయినపల్లి నుంచి కొత్త ఈదర వరకు రూ.3.70 కోట్లతో నిర్మించే రహదారికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ గోళ్ల అనూష, వైస్ ఎంపీపీ కొండ వరదలు రమేష్, జెడ్పీటీసీ పిన్నిబాయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజన కుమారి, ఎంపీడీవో శామ్యూల్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు

విద్యుత్ సరఫరాలో మార్పులు

చాట్రాయి: విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ బుధవారం తెలిపారు. మండలంలోని చీపురుగూడెం, పోలవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన చెప్పారు. రైతులు గమనించాలని ఆయన కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం

చాట్రాయి: మండలంలోని సి.గుడిపాడు గ్రామంలో ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవాన్ని బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా పఠించారు. అనంతరం రెండు వేల మందికి అన్నదానం చేశారు.

ఉద్యోగంలో ప్రతిభ చూపాలి

ఇబ్రహీంపట్నం: యువ ఇంజినీర్ ప్రసాదరావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఉద్యోగంలో ప్రతిభ చూపాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్‌గౌతమ్, ఏపీ జెన్‌కో శిక్షణ కేంద్రం చీఫ్ ఇంజినీర్ నాగభూషణరావు అన్నారు. ఎన్టీటీపీఎస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు ఏఈఈ గద్దం ప్రసాదరావు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఇటీవల డాక్టరేట్ పొందాడు. పాలిమ్రా బయోడీజిల్ ఇంధనంతో నడిచే వీసీఆర్ ఇంజిన్‌పై పరిశోధనలు జరిపిన గ్రంథాన్ని ఆంధ్ర యూనివర్సిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రసాదరావు మెకానికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ డిగ్రీ అందజేశారు. ఈ మేరకు ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్‌గౌతమ్, ఏపీ జెన్‌కో శిక్షణ కేంద్రం చీఫ్ ఇంజినీర్ నాగభూషణరావు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రసాదరావు డాక్టరేట్ పొందటం ఏపీ జెన్‌కో సంస్థకు గర్వకారణమన్నారు. అనంతరం ఆయనను పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్‌కిరణ్, బ్రాంచి అధ్యక్షుడు ఉమా విజయ్‌చంద్, కార్యదర్శి సాల్మన్‌శాస్త్రి, మనోహర్ సత్యప్రసాద్, మణిబాబు వెంకటరమణ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో ప్రసాదరావును సత్కరిస్తున్న నవీన్‌గౌతమ్, నాగభూషణం

కొత్త ఫీడర్‌తో లోవోల్టేజి సమస్యకు పరిష్కారం

గంపలగూడెం: మండలంలోని నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో 22 వేల డొమెస్టిక్ సర్వీసులు, 6 వేల అగ్రికల్చర్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ మొత్తం కనెక్షన్‌లకు గడచిన నాలుగు దశాబ్దాలుగా కంభంపాడు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఒకే ఫీడర్ (గంపలగూడెం) నుంచి విద్యుత్ సరఫరా అవడంతో తరచూ పలు సమస్యలు ఎదురయ్యేవి. సమస్య పరిష్కారంలో భాగంగా గతంలో ఉన్న ఫీడర్‌కు అదనంగా మరో ఫీడర్‌ను (ఊటుకూరు ఫీడర్) మండలంలో ఏర్పాటు చేశారు. ఏకొండూరు 220/132/33 నుంచి గంపలగూడెం వరకు ప్రత్యేక లైన్‌తో ఫీడర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫీడర్‌ను పెనుగొలను, ఊటుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్లకు కలిపి, పాత ఫీడర్‌ను గంపలగూడెం, కనుమూరు సబ్‌స్టేషన్‌లకు కేటాయించారు. దీంతో లోవోల్టేజి, విద్యుత్ సరఫరాలో అంతరాయం సమస్యలు పరిష్కారం అవుతాయని గంపలగూడెం ఏఈ కొమ్ము వాసు వివరించారు. నూతన ఫీడర్‌కు ఉన్నతాధికారులు శనివారం విద్యుత్ చార్జి (విద్యుత్ సరఫరా) చేశారని వాసు తెలిపారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

నూజివీడు: మామిడి తోటల్లో సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా తెగుళ్లను, పురుగులను నివారించుకోవచ్చని వ్యవసాయాధికారిణి రాజులపాటి హేమ పేర్కొన్నారు. మండలంలోని యనమదల, బత్తులవారిగూడెంలోని మామిడి తోటలను బుధవారం సందర్శించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. తోటల్లో తామర పురుగులు, కొక్కెం పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. తామర పురుగుల నివారణకు తోటల్లో పసుపు, నీలం రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని, దీంతో తామర పురుగులు ఈ అట్టలకు అతుక్కుపోతాయన్నారు. వేప నూనె 1500 పీపీఎం మూడు ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. తామర పురుగుల ఉధృతి అధికంగా ఉంటే స్పైనోసాడ్ 0.25 ఎంఎల్ లీటరు నీటికి, పొంగామియా సోప్ 7.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కొక్కెం పురుగుల (దారం పురుగులు)ను క్లోరీపైరిఫాస్ ఒక ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించుకోవచ్చన్నారు. రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.



బత్తులవారిగూడెంలో మామిడి రైతులకు సూచనలు చేస్తున్న హెచ్‌వో రాజులపాటి హేమ

నేడు విగ్రహ ప్రతిష్ట

విస్సన్నపేట: మండలంలోని నరసాపురం గ్రామంలో దాతలు, భక్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం గురువారం ఉదయం 11.31 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు జి. సుబ్రహ్మణ్యేశ్వరరావు బుధవారం తెలిపారు. సూర్య, లక్ష్మీ నారాయణ, దశావతార, అష్టలక్ష్మీ, జీవధ్వజ, గ్రామ నాభిశిల, ముత్యాలమ్మ, శివలింగ, నవగ్రహ ప్రతిష్టా మహోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నసమారాధన చేస్తారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ రాజకిషోర్ తెలిపారు. మండలంలోని పెద్దాపురం, తిమ్మాపురం, గూడెంమాధవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా తాగునీరు, వెలుతురు సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

ముసునూరు: విద్యాహక్కు చట్టం ప్రకారం 2024–25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ బీవీ సుబ్బారావు తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఒకటో తరగతి నుంచి ప్రవేశానికి ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మండల విద్యా శాఖాధికారి, జిల్లా విద్యా శాఖాధికారి, టోల్ ఫ్రీ నంబరు 18004258599లో సంప్రదించాలని సూచించారు.

శివాలయ నిర్మాణానికి శంకుస్థాపన

లోపూడి (ముసునూరు): శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని లోపూడి గ్రామంలో సుమారు రూ.60 లక్షలతో నిర్మించ తలపెట్టిన శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మించనున్నారు. వైస్ ఎంపీపీ రాజానాయన దంపతులతో పాటు, మరో పది మంది దంపతులు పీటలపై కూర్చుని శంకుస్థాపన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేరం కృష్ణ, జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టైలర్ల ప్రదర్శన



తిరువూరు: ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని తిరువూరులో బుధవారం నిర్వహించారు. తిరువూరు టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరాల సెంటర్ నుంచి బోస్ బొమ్మ వరకు ప్రదర్శన నిర్వహించారు. టైలరింగ్ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, అర్హులైన టైలర్లందరికీ జగనన్న తోడు కింద ప్రభుత్వ ఆర్థిక సాయం మంజూరు చేయాలని అసోసియేషన్ నిర్వాహకులు కోరారు.

లాజిస్టిక్ రంగంపై అధ్యయనం చేయాలి

మైలవరం: లాజిస్టిక్ రంగంలో వస్తున్న మార్పులపై విద్యార్థులు అధ్యయనం చేయాలని ప్రవాసాంధ్రులు, విద్యాదాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం, చెన్నై లాజిస్టిక్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ విభాగం ఆధ్వర్యంలో 'లాజిస్టిక్ రంగంలో సమకాలీన మార్పులు' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సెమినార్ బుధవారం నిర్వహించారు. డాక్టర్ హనిమిరెడ్డి మాట్లాడుతూ లాజిస్టిక్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎన్నో ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ లాజిస్టిక్ రంగంపై పరిజ్ఞానం ఉండాలన్నారు. ప్రొఫెసర్ ఎస్.గణేశన్, డాక్టర్ గాయత్రి అతిథ్య ఉపన్యాసం ఇచ్చారు. లాజిస్టిక్ రంగం ఆటోమేషన్, రోబోటిక్స్, ఐటీ, బిగ్ డేటా ఎనాలసిస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగించి త్వరగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగం నుంచి శ్రీనివాసరావు, శ్రీజ, నారాయణరావు, రామారావు, శ్యాంసుందర్, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.